క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



నందిగామ: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని శుక్రవారం పౌరసరఫరాల శాఖ అధికారులు సీజ్ చేశారు. పౌరసరఫరాల శాఖ డీటీ కె. రామ్మూర్తిరెడ్డి కథనం మేరకు అంబారుపేట వైపు నుంచి లారీలో బియ్యం తరలిస్తున్నారనే సమాచారం రావడంతో వాహనాన్ని తనిఖీ చేశారు. ఆ సమయంలో లారీలో తరలిస్తున్న 24 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు సదరు వ్యాపారిపై కేసు నమోదు చేసి, లారీని సీజ్ చేసినట్లు డీటీ తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పెనుగంచిప్రోలు: కొట్లాట విషయమై ఇరువర్గాలపై కేసు నమోదు అయిన ఘటన పెనుగంచిప్రోలులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు ఆలయం వద్దకు వచ్చిన భక్తుల మేకపోతును కోసే విషయమై ఇరువర్గాలు వారు కొట్లాడుకున్నారు. దీనికి సంబంధించి 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

అవగాహన ర్యాలీ



చిల్లకల్లు(జగ్గయ్యపేట): చిల్లకల్లు అంగనవాడీ కేంద్రంలో శుక్రవారం జన భాగీరదీ కార్యక్రమం జరిగింది. తొలుత గ్రామంలో అంగనవాడీ కార్యకర్తలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రీస్కూల్ కార్యక్రమాలు, ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీభార్గవి పాల్గొన్నారు.

కచ్చితమైన హద్దులు కొలతలతో భూ సర్వే

కంచికచర్ల: మండలంలోని పేరకలపాడు, గండేపల్లి, పెండ్యాల, బత్తినపాడు, వేములపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ అధికారులు భూముల రీ సర్వే పనులు చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ షేక్ నాగుల్‌మీరా, మండల సర్వేయర్ బసవరావు సర్వే పనులు పరిశీలించారు. ఈ మేరకు డీటీ మాట్లాడుతూ 100 ఏళ్ల నాటి క్రితం చేసిన భూముల్లో కచ్చితమైన కొలతలు, హద్దులు ఉండేలా భూ సర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని రైతులు సహకరించాలన్నారు. భూ సర్వే చేపట్టిన అనంతరం భూ సర్వే రికార్డుల్లో నమోదు చేసి పత్రాలు రైతులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

19న ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు

చిలకలపూడి(మచిలీపట్నం): 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశం కోసం ఈ నెల 19వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కేబీఆర్ ప్రభుత్వ భాగస్వామ్య శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ గొంది హరిధర్మేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19వ తేదీ ఉదయం 9 గంటలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. అడ్మిషన్లు పొందిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మిగిలిన కేటగిరీలకు చెందిన అభ్యర్థులు రూ. 60 కాషన్ డిపాజిట్ చెల్లించాలన్నారు. ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో చేరే వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు 10వ తరగతి మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్ అన్నీ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్: 08674–245953, 82975 74757 నెంబర్లను సంప్రదించాలన్నారు.

వసతిగృహ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అవనిగడ్డ: బీసీ వసతి గృహాల్లో ప్రవేశానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ బాలికల వసతి గృహ అధికారి నాగమణి తెలిపారు. ఈ వసతి గృహంలో బీసీలకు 75 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం, ఓబీసీలకు 9 శాతం సీట్లు ఇస్తామని చెప్పారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రామలింగేశ్వరునికి అభిషేకాలు

నాగాయలంక: స్థానిక శ్రీరామ పాదక్షేత్రం వద్ద కృష్ణానదిలోని మండపంలో గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర శివలింగానికి భక్తులు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాస శివరాత్రి పర్వదినం శివునికి ప్రీతిపాత్రం కావడంతో శుక్రవారం బ్రహ్మశ్రీ అంబా సాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో భక్తులు రామలింగేశ్వరునికి, నందీశ్వరునికి శాస్త్రోక్తంగా పూజలు జరిపి మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించారు.

ఆరు నెలల్లో హైవే బస్టాండ్ నిర్మాణం పూర్తి చేస్తాం

ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి



పేట హైవే బస్టాండ్ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి ప్రభుత్వ విప్ ఉదయభాను, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ ప్రజల చిరకాల వాంఛ అయిన హైవే ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణాన్ని వచ్చే ఆరు నెలల్లో పూర్తి చేసి జగ్గయ్యపేట పట్టణ ప్రజలకు కానుకగా ఇస్తామని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణ సమీపంలోని 65వ నంబరు జాతీయ రహదారికి ఆనుకుని ఫుడ్ ప్లాజా వెనుక ఏపీఐఐసీకి చెందిన ఎకరం స్థలంలో రూ. కోటి వ్యయంతో నిర్మించనున్న హైవే బస్టాండ్ నిర్మాణానికి ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ చైర్మన్ మాట్లాడుతూ సంస్థ నేడు ఈ స్థాయిలో ఉందంటే అందుకు కారణం దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి, ఆయన తనయుడు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని అన్నారు. 2004 సంవత్సరంలో ఆర్టీసీ నష్టాల్లో ఉండగా ఆదుకోవాలని ఆర్టీసీ యూనియన్ల నాయకులు, సభ్యులు వైఎస్.రాజశేఖర్‌రెడ్డిని కలిసి విన్నవించగా రూ.500 కోట్లు ఇచ్చి ఆదుకున్నారని తెలిపారు. అంతేకాకుండా 1,000 కొత్త బస్సులను కొనడానికి అనుమతి ఇచ్చారన్నారు. తరువాత పాదయాత్రలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని యూనియన్ల నాయకులు, సభ్యుల కలిసి ఆర్టీసీ పరిస్థితిని విన్నవించగా తాను ముఖ్యమంత్రిని అయితే శాశ్వత పరిష్కారంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అదే విధంగా 53 వేల మందిని విలీనం చేసి చరిత్ర సృష్టించారన్నారు. మన దేశంలో 27 రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా ఒక్క ఏపీలోనే ఆర్టీసీని విలీనం చేశారని తెలిపారు. అలాగే జగ్గయ్యపేట హైవే బస్టాండ్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే ఉదయభాను చేస్తున్న భగీరథ ప్రయత్నం మరువలేనిదన్నారు. బస్టాండ్ నిర్మాణానికి ప్రస్తుతం మంజూరైన రూ.1 కోటికి అదనంగా మరి కొంత సహాయం చేస్తామని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, వేదికపై ఎమ్మెల్యే ఉదయభాను, ఎండీ

రీచార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేస్తాం

ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఉదయభాను కోరిన మేరకు పలు నూతన బస్ సర్వీసులను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే బస్టాండ్ నిర్మాణానికి అదనంగా మరికొన్ని నిధులు మంజూరునకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. నూతన హైవే బస్టాండ్ నిర్మాణంలో ఎలక్ట్రికల్ బస్సులకు సౌకర్యంగా ఉండేందుకు ఎలక్ట్రికల్ చార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

హైవేలో బస్టాండ్ ఉంటేనే అభివృద్ధి

సూర్యాపేట, కోదాడు, నందిగామ అభివృద్ధి చెందాయంటే హైవే మీద బస్టాండ్ ఉండడం వలనే అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. జగ్గయ్యపేట మూడు కిలో మీటర్లు లోపలకు ఉండడం వలన అభివృద్ధి జరగడం లేదన్నారు. అందుకోసం పేట పట్టణాన్ని జాతీయ రహదారి వరకు విస్తరింపజేస్తున్న నేపథ్యంలో ఈ హైవే బస్టాండ్ రూ.కోటి వ్యయంతో అందంగా, ఒకేసారి నాలుగు బస్సులు ఆగేవిధంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ రూ.కోటితో పాటు ఇంకా అదనంగా నిధులు మంజూరు చేయాలని ఆర్టీసీ ఉన్నతాధికారులను కోరారు. అలాగే జగ్గయ్యపేట డిపోకు ఎంతో చరిత్ర ఉందన్నారు. 1963 లోనే ఉమ్మడి జిల్లాలో ఉన్న మూడు డిపోల్లో విజయవాడ తరువాత పేట డిపో ఒకటిగా ఉండి ప్రాధాన్యం సంతరించుకుందన్నారు. డిపోకు 20 ఎకరాల స్థలం, గ్రౌండ్ ఉన్నందున ఇంకా అభివృద్ధి చేయాలన్నారు. అలాగే పేట ఆర్టీసీ డిపో నుంచి ఇతర సుదూర ప్రాంతాలకు బస్సు సర్వీలను నడపాలని వినతి పత్రం ఇచ్చారు. పేట డిపో నుంచి మంత్రాలయానికి బస్సు నడపాలని, అనంతపురానికి, కర్నూలుకు, చెన్నైకు, సూర్యాపేట జిల్లా చింతిర్యాల, దొండపాడు, రామాపురానికి సర్వీసులను నడపాలని కోరారు. అలాగే పేట డిపో నుంచి హైదరాబాద్‌కు రూట్లు పెంచి ఇంద్రాణి వంటి ఏసీ బస్సులు నాలుగు ఏర్పాటుచేయాలని, హైదరాబాద్‌కు ఉదయం ఐదు గంటలకు బస్సును నడపాలని, కోదాడ, విజయవాడకు సర్వీసులు పెంచాలని కోరారు. నూతన బస్టాండ్ నిర్మాణం ఆరు నెలల్లో పూర్తయ్యే విధంగా చూడాలని అధికారులను కోరారు. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు స్పందించి ఎమ్మెల్యే ఉదయభాను చేసిన బస్సుల ఏర్పాటు సూచనను పరిశీలించి అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ తాతినేని పద్మావతి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా, కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, దుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి, ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి ఎంవై.దానం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్, పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, జడ్పీటీసీలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మీయ స్వాగతం



టిడ్కో ఇళ్ల పంపిణీకి శుక్రవారం గుడివాడ విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ ఆత్మీయ స్వాగతం పలికారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలపై తీర్మానం

నందిగామ: మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలపై తీర్మానం చేశారు. మున్సిపల్ చట్టం 1965 లోని షెడ్యూల్ (1) లోని రూల్–3 ప్రకారం 13 మంది కౌన్సిలర్లు చైర్ పర్సన్, కమిషనర్లకు సమావేశం ఏర్పాటు చేసుకునేందుకు అనుమతివ్వాలని అర్జీ ద్వారా కోరారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత కార్యాలయానికి వచ్చిన చైర్ పర్సన్ మండల వరలక్ష్మి నా అనుమతి లేకుండా సమావేశం ఏర్పాటు చేయడంతో పాటు నన్ను అవమానించారంటూ సమావేశానికి హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో 10:45 కు సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు వైస్ చైర్ పర్సన్ ఎం.నాగరత్నం అధ్యక్షతన సమావేశం నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాంను కోరారు. అనంతరం వైస్ చైర్ పర్సన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఐదు అంశాలతో కూడిన అజెండాలోని అంశాలను మున్సిపల్ సిబ్బంది కౌన్సిలర్లకు వివరించగా ఆ అంశాలకు కౌన్సిలర్లు చేతులెత్తి ఆమోదాన్ని తెలియజేశారు. ఈ సమావేశానికి 17 మంది కౌన్సిలర్లు, ముగ్గురు కో ఆప్షన్ సభ్యులు హాజరయ్యారు.

హడావిడి చేసిన టీడీపీ కౌన్సిలర్లు

కౌన్సిల్ సమావేశానికి హాజరైన టీడీపీ కౌన్సిలర్లు కాసేపు హడావిడి చేసి వెళ్లిపోయారు. తొలత అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత బయటకు వెళ్లిపోయిన ప్రతిపక్ష కౌన్సిలర్లు కొద్దిసేపటికి మరోసారి కౌన్సిల్ హాల్లోకి వచ్చి వారి వద్ద ఉన్న అజెండా పత్రాలను చించి కమిషనర్ వద్ద పడేసి వెళ్లిపోయారు.



సమావేశంలో అధికార పార్టీ కౌన్సిలర్లతో వాదిస్తున్న ప్రతిపక్ష కౌన్సిలర్

అనుమతి లేకుండా సమావేశం ఏర్పాటు

తన అనుమతి లేకుండా కౌన్సిల్ సభ్యులు సమావేశాన్ని ఏర్పాటు చేసి అవమానించారని చైర్‌పర్సన్ ఎం.వరలక్ష్మి పేర్కొన్నారు. అందుకే తాను సమావేశానికి హాజరు కాలేదని తెలిపారు. కమిషనర్ కూడా ఉద్దేశపూర్వకంగా తనను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్‌ను వివరణ కోరగా మున్సిపల్ యాక్ట్ ప్రకారమే కౌన్సిల్ సభ్యుల అభ్యర్థన మేరకు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఒక అధికారిగా తాను చేయవలసిన పని మాత్రమే చేశానని తనకు ఎవరిపైన వ్యక్తిగత కక్షలు లేవని పేర్కొన్నారు.

జననేతకు ఘనస్వాగతం

- హెలీప్యాడ్ వద్ద సీఎంకు స్వాగతం పలికిన మంత్రులు, ఎమ్మెల్యే కొడాలి నాని, ప్రజాప్రతినిధులు, అధికారులు
- హెలీప్యాడ్ నుంచి సభాప్రాంగణం వరకు పూలవర్షం కురిపించిన అభిమానులు
- తరలివచ్చిన మహిళాలోకం

గుడివాడరూరల్: టిడ్కో ఇళ్ల పంపిణీకి శుక్రవారం గుడివాడ విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఘన స్వాగతం పలికారు. హెలీప్యాడ్ వద్ద నుంచి బహిరంగ సభ ఏర్పాటు చేసిన ప్రాంగణం వరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పూలవర్షంతో స్వాగతం పలికారు. కాగా ఇళ్ల పరిశీలన అనంతరం బహిరంగ సభ వద్దకు చేరుకునే సమయంలో సీఎం ప్రజలకు అభివాదనం చేసుకుంటూ స్టేజ్ వద్దకు చేరుకున్నారు. తొలుత తాడేపల్లి వద్ద నుంచి గుడివాడ మల్లాయపాలెం వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద హెలీకాప్టర్ దిగిన ముఖ్యమంత్రికి పలువురు ఘన స్వాగతం పలికారు. మంత్రులు, ఉన్నతాధికారులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, తహసీల్దార్ కె.ఆంజనేయులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, రాష్ట్ర ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.





గుడివాడ టిడ్కో ఇళ్ల నమూనాను సీఎంకు అందజేస్తున్న పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, ప్రజాప్రతినిధులు, అధికారులు

తరలివచ్చిన మహిళాలోకం..

గుడివాడలో టిడ్కో ఇళ్ల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు గుడివాడ నియోజకవర్గంతో పాటు పలు నియోజకవర్గాలు, జిల్లా వ్యాప్తంగా భారీగా మహిళలు తరలివచ్చారు. మహిళలతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, యువత జగన్‌మోహన్‌రెడ్డి సభాప్రాంగాణానికి చేరుకోగానే నినాదాలు పలికారు. ముఖ్యమంత్రి కూడా పార్టీ నాయకులను, ప్రజాప్రతినిధులు, వివిధశాఖల అధికారులతో ఆప్యాయంగా పలకరించి వారితో కొంతసేపు ముచ్చటించారు. దారిలో కనిపించిన దివ్యాంగుడు మోహన్‌రెడ్డితో ముఖ్యమంత్రి కిందకూర్చుకుని సెల్ఫీ దిగారు. దీంతో అక్కడ ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు కేరింతలు కొట్టారు. గృహప్రవేశాలు చేసిన, ఇళ్లస్థలాలు తీసుకున్న పలువురు మహిళలు తమ ఆనందాన్ని వెల్లడించారు.

కల నెరవేరింది



గత ప్రభుత్వంలో ఇల్లు కావాలని తిరిగితే కాళ్లకు ఉన్న చెప్పులు అరగటమే తప్ప పని అయ్యేదే కాదు. జగన్ ప్రభుత్వం వచ్చాక అలాంటి పరిస్థితులు లేకుండా పోయాయి. ఇంటికే అన్ని పథకాలు వచ్చేస్తున్నాయి. ఆ పథకాల్లో భాగంగానే మాకు సొంతింటి కల కూడా నెరవేరింది.

–గొద్దెళ్ల నాగమణి, లబ్ధిదారురాలు

చాలా ఆనందంగా ఉంది



సొంతిల్లు కావాలని ఏ కుటుంబానికి కోరిక ఉండదు. కాని గతంలో ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండా పోయింది. చాలా మంది నాయకులు, అధికారుల దగ్గరకు తిరిగినా ఫలితం దక్కలేదు. మేము ఊహించని విధంగా ఇంటింటికీ వచ్చే వలంటీర్లే ఈ సారి మాకు ఇల్లు వచ్చినట్లుగా చెప్పారు.

–నత్తా కల్పన, లబ్ధిదారురాలు

జగన్ మా ఇంటి సభ్యుడే



సీఎం వై.ఎస్.జగన్ మా ఇంటి చిరకాల స్వప్నం నెరవేర్చి మా ఇంటి సభ్యుడయ్యాడు. సొంతిల్లు మాకు ఇప్పుడూ కలగానే ఉంటుందని అనుకున్నాం. ఒక్క జగన్ ప్రభుత్వంలోనే నెరవేరింది. ఇళ్లకు అద్దెలు కట్టుకోలేక ఇబ్బందులు పడేవాళ్లం. సొంతింటితో ఆ బాధలు అన్నీ తీరాయి.

–మద్దాల దేవమణి, లబ్ధిదారురాలు

జనం గుండెల్లో నిలిచిపోతారు..



టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచి కొడాలి నాని మా గుడివాడ ప్రజలకు ఇళ్లను ఏర్పాటు చేసేందుకు పాదయాత్ర కూడా చేశారు. కానీ ఇప్పుడు అది ఒక్క జగన్ ప్రభుత్వంలోనే నెరవేరింది. మాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు ఇళ్లను కల్పిస్తున్న జగన్ జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు.


–బొల్లవరపు సుగుణ, లబ్ధిదారు

ముగిసిన అధ్యాపక శిక్షణ



కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో నిర్వహించిన ఐటీసీ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన అధ్యాపక శిక్షణ శుక్రవారంతో ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీ వంశీకిరణ్ తెలిపారు. ఐదు రోజుల నుంచి ప్రముఖ ఎడ్ టెక్ సంస్థ ఐటీసీ అకాడమీకి చెందిన ప్రొఫెసర్ కుమారగురు 'రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ అసోసియేట్' అను నూతన సాంకేతికతపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ వలన నియమ ఆధారిత పనులను ఆటోమేట్ చేసేందుకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ప్రతి సంస్థలో ఆటోమేట్ చేయగల ప్రక్రియలను గుర్తించి క్రమబద్ధీకరించి తద్వారా వాటిని ఆటోమేట్ చేయవచ్చని సూచించారు. కాగా పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 50మంది అధ్యాపకులు పాల్గొన్నారని కళాశాల విభాగాధిపతి డి.ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ డి.పాండురంగారావు, డాక్టర్ జీ సాయి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా శాంతికల్యాణం



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శాంతి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన కృత్తికా నక్షత్రం సందర్భంగా ఈ కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో కల్యాణతంతు నిర్వహించారు. పలువురు దంపతులు ఈ కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ శౌంరి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

పేద విద్యార్థులకు అండగా ప్రభుత్వం



లింగాలపాడు పాఠశాలలో నిర్వహించిన ఆణిముత్యాలు కార్యక్రమం

నందిగామ: మన రాష్ట్రంలో పేద విద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని లింగాలపాడు గ్రామ సర్పంచ్ బొల్లినేని పద్మజ అన్నారు. మండలంలోని లింగాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయిలో పలువురు విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసా పత్రం, మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. పాఠశాల ఆళ్ల రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గురు స్వామి పాల్గొన్నారు.

ఆణిముత్యాలకు సత్కారం

వీరులపాడు: మండలంలోని జమ్మవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరించి ప్రోత్సాహక బహుమతులు అందించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సుజాత, సర్పంచ్ అనూషరాణి, నాయకులు దాసు, శ్రీనివాసరావు, తిరుమలరావు పాల్గొన్నారు.

నేడు ఆలయ హుండీల లెక్కింపు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయ హుండీలను శనివారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో ఉదయం ఎనిమిది గంటల నుంచి జరిగే ఈ లెక్కింపులో ఆలయ సిబ్బందితో పాటు ఔత్సాహికులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

పంటల నిల్వకు ప్రభుత్వ గోదాములు శ్రేయోదాయకం



మాట్లాడుతున్న ఐసీఎం డైరెక్టర్ శ్యామ్‌కుమార్

రేమాలవారిపాలెం(నాగాయలంక): రైతులు తాము పండించిన పంటల ఉత్పత్తులను ప్రభుత్వ గోదాముల్లో నిల్వ ఉంచుకోవడం ద్వారా విస్తృత ప్రయోజనాలు పొందుతారని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కో–ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఎం) ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ శ్యామ్‌కుమార్ అన్నారు. స్థానిక దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సొసైటీ అధ్యక్షుడు ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు అధ్యక్షతన రైతులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను రైతులు అమ్ముకునే సమయంలో గిట్టుబాటు ధర లేక, పంటల నిల్వపై అవగాహన కొరవడి విధిలేక మార్కెట్‌లో తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారన్నారు. రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను అధ్యయనం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిడ్డంగుల అభివృద్ధి, నియంత్రణ సంస్థను ఏర్పాటు చేశాయని, తద్వారా గిట్టుబాటు ధరలు లభించే వరకు ప్రభుత్వ గోదాముల్లో రైతులు తమ పంటల ఉత్పత్తులను నిల్వ చేసుకుని మెరుగైన ధర పొందవచ్చునని వివరించారు. నిల్వ కాలంలో రైతులకు డబ్బు అవసరమైతే గోదాములలో పంట నిల్వ ఆన్‌లైన్ రసీదులతో బ్యాంకుల ద్వారా 60 నుంచి 80 శాతం వరకు రుణాలు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రతి సహకార వ్యవసాయ పరపతి సంఘం పరిధిలో రైతుల కోసం గోడౌన్‌ల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. పీఏసీఎస్ అధ్యక్షుడు చంటి మాట్లాడుతూ రైతులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను వివరించారు. జిల్లా సహకార అధి కారి వీవీ ఫణికుమార్, మండల వ్యవసాయ అధికారి అన్నలూరు సంజీవ్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు శ్రీనివాసరావు, బసవారావు, కేడీసీసీ బ్యాంక్ సూపర్‌వైజర్ రెహాము న్నీసా, పీఏసీఎస్ సీఈఓలు పాల్గొన్నారు.